క్లుప్తంగా

జీఎంసీ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థకు సంబంధించి అధికారిక వెబ్ సైట్, మొబైల్ యాప్‌ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆవిష్కరించారు. గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి వాటిని ప్రారంభించారు. వీటిని మెరుగు పరిచేందుకు సూచనలు అందించాలని ప్రజలను కోరారు. ఫిర్యాదులు, సేవలను పొందేందుకు వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు భరోసా



నెహ్రూనగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, వారికి అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికురాలు జి.కొండమ్మ చనిపోగా ఆమె కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.5 లక్షలు, కోనా రమాదేవి చనిపోగా ఆమె కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్‌ను గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. మట్టి ఖర్చులు రూ.15వేలను ఇప్పటికే ఇచ్చామన్నారు.

తూకంలో మోసాలపై అప్రమత్తత ముఖ్యం




నెహ్రూనగర్: తూకంలో మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన మెట్రాలజీ డేని పురస్కరించుకుని 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం కృష్ణానగర్ రైతుబజార్‌లో తూకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వస్తువులను కొనుగోలు చేసే సమయంలో కాటాలను జాగ్రత్తగా గమనించాలన్నారు. ఆనంతరం పాత సామాన్లు, పేపర్లు కొనుగోలు చేసే వారు ఎటువంటి రాళ్లను ఉపయోగించి మోసం చేస్తున్నారనే అంశంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జి. సునీల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళగిరి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోలి అరుణకు రూ.2.54 లక్షలు.. సూర్యనారాయణ నగర్‌కు చెందిన చిట్టెమ్మకు రూ.81 వేలు.. మంగళగిరి మండల పరిధిలోని నవులూరు గ్రామానికి చెందిన లక్ష్మీ సుధకు రూ.1.50 లక్షలు.. కోటేశ్వరరావుకు రూ.1.30 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, నాయకులు షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, గుత్తికొండ ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు గుంటూరుకు చెందిన మెడెక్స్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో 250 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కొందరు విద్యార్థులకు లాసిక్, కంటి శుక్లాల సమస్యలు గుర్తించి వైద్య సలహాలు, మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం డి.శ్రీనివాసరావు, మెడికల్ డైరెక్టర్ మాధవీలత, క్యాంపు కోఆర్డినేటర్ లక్కా నాగరాజు, వైద్య సిబ్బంది అనూష, రాజశేఖర్ కళాశాల కోఆర్డినేటర్లు టి.రాజు, జి.కిరణ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారమే లక్ష్యం

నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్ .శరత్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శరత్‌బాబు

గుంటూరు లీగల్: జరగబోయే లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ప్రమాదాల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్ .శరత్ బాబు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం పలు ఇన్సూరెన్స్ కంపెనీస్, కంపెనీ న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి శరత్‌బాబు మాట్లాడుతూ కంపెనీ సభ్యులు, కౌన్సెల్స్ పూర్తిగా సహకరించి ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమస్యలుంటే పిటిషనర్‌ను, కౌన్సెల్‌ను పిలిపించి ప్రీ సిట్టింగ్ ద్వారా కేసును రాజీ చేయవచ్చని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కూడా సహకరించాలని ఆయన కోరారు. మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు, రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, ఇన్సూరెన్స్ కంపెనీస్, కంపెనీ కౌన్సెల్స్, ప్రతినిధులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో బార్ కౌన్సెల్ మెంబర్ వి.బ్రహ్మా రెడ్డి, న్యూ ఇండియా ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇన్సూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో పాటు కంపెనీ కౌన్సెల్స్ పాల్గొన్నారు .

విద్యుత్ అక్రమంగా వాడితే చర్యలు

- వినియోగదారులకు అధికారుల హెచ్చరిక
- తనిఖీల్లో అక్రమాల గుర్తింపు
- రూ.14.30 లక్షల జరిమానా వసూలు

కొరిటెపాడు(గుంటూరు): నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబులు తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు డీ–1 సెక్షన్ పరిధిలో బ్రాడీపేట, అరండల్ పేటలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 55 మంది అధికారులు, 185 మంది సిబ్బంది మొత్తం 59 బృందాలుగా ఏర్పడ్డారు. 4,019 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతించినది కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న 13 మందికి రూ.2.95 లక్షలు, అదనపు లోడు వాడుతున్న 216 మందికి రూ.11.35 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ వినియోగించాలని పేర్కొన్నారు. పబ్లిక్ పోల్స్‌పై కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, షేక్ ముస్తాక్ అహ్మద్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, కె.అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావాల్సిన బకాయిలు చెల్లించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న దుర్గారావు, స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. గురువారం బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ఆయన ప్రారంభించి మద్దతు తెలియజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ.. చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిలు మాత్రమే కార్మికులు అడుగుతున్నారని.. ప్రభుత్వం ఈ విషయం గమనించి యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కార్మికులు బి.దానయ్య, నవనీతం, శివకుమారి, గురవయ్య, సుబ్బారావు, సాంబయ్య, రమాదేవి, నాగేశ్వరరావు, అంకయ్య, రమణ, సారమ్మ, దుర్గాభవాని, యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ఊరేగింపు మహోత్సవం



వాహనంలో ఊరేగిస్తున్న ధ్వజస్తంభం

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో శ్రీ భక్తాంజనేయ స్వామి విగ్రహ, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ధ్వజస్తంభ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాషాయ జెండాలతో నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీ కనులపండువుగా సాగింది. స్వామివారి వేడుకలు 14న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కాజ(మంగళగిరి): నగర పరిధిలోని కాజలో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. భారత్ సైనికులు పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డక బ్రహ్మయ్య, కూరాకుల బాపయ్య, ఆర్ల వెంకయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం

దుగ్గిరాల: పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీల సీనియర్ నాయకులు షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. గత నెల 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మనదేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించిందని.. భారత సైన్యం తగిన వ్యూహంతో అర్ధరాత్రి మెరుపు దాడులు చేశాయని ఆయన పేర్కొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లి రూరల్: ఈనెల 20న నిర్వహించనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులను కలసి కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేయడమే కాక.. కార్మికులకు రూ.26 వేల కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు రాంబాబు, ప్రసాద్, కృష్ణ తులసి, రవి, తిరుపతిరావు, కోటేశ్వరి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం



ప్రమాదంలో దగ్ధమైన షాప్

మేడికొండూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి టైలర్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని పేరేచర్లలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. షాపు యజమాని షేక్ జమీర్ ఉదయం షాపు తీసి మధ్యాహ్నం వరకు బట్టలు కుట్టాడు. అనంతరం షాప్ మూసివేసి భోజనానికి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి షాపులో దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. టైలర్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ప్రమాదంలో టైలర్ షాపులో నాలుగు అధునాతనమైన ఖరీదైన కుట్టు మిషన్లు, కష్టమర్లవి కొత్తగా ఇచ్చిన బట్టలు, కుట్టి పూర్తయిన తర్వాత డెలివరీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచినవి మొత్తం రూ.2 లక్షల వరకూ ఉంటాయని అన్నాడు. తన కుటుంబ జీవనోపాధి బతుకుదెరువు టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నానంటూ బాధితుడు వాపోయాడు.

'పేపర్ క్రాఫ్ట్స్'పై శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. పొడుపు కథలు చెప్పడం, జనరల్ నాలెడ్జ్ అంశాలతోపాటు డ్రాయింగ్ వేసిన బొమ్మలకు రంగులు అద్దడం, పుస్తక పఠనం వంటి కార్యక్రమాలను కూడా నిర్వహించారు. గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి. సత్యశిరీష పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



నగరంపాలెం: స్థానిక ఆర్ అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రభాతభేరి అనంతరం లక్ష కుంకుమార్చన వైభవంగా చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్‌బాబు, కొనకళ్ల సత్యం, కోట శేషగిరి, అవరపల్లి శ్రీను, అన్నవరపు చక్రి పాల్గొన్నారు.

పీఎంజేఏవై సర్వే 80 శాతం పూర్తి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పీఎంజేఏవై సర్వే 80శాతం పూర్తయినట్లు వైద్యాధికారి యానీగ్రేస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి రేషన్ కార్డు దారుల ఆరోగ్యపరమైన వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారని అన్నారు. 70 ఏళ్లు నిండిన వారి ఆరోగ్యపరమైన సమస్యలు, ఎత్తు, బరువు, షుగర్, బీపీ వంటి పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పీఎంజేఏవై కార్డు అందిస్తామని దాని ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఆరోగ్య పరమైన చికిత్స చేయించుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రూ.5 లక్షల వరకు ప్రభుత్వపరమైన సహాయం కార్డు ద్వారా అందుతుందని చెప్పారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞాన దివ్యకు పతకాలు



మంగళగిరి: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత దేశం తరఫున పాల్గొన్న నాగం జ్ఞాన దివ్య ప్లస్ 84 కేజీల విభాగంలో రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని గురువారం తెలిపారు. తెనాలికి చెందిన జ్ఞాన దివ్య పతకాలు సాధించడంతో అభినందించారు.

12న ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



మంగళగిరి: బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న మంగళగిరి ఆటోనగర్‌లోని రాయల్ కన్వెన్షన్ హాలులో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. గురువారం రాయల్ బంకెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సంబంధిత గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'కళలసిరి మంగళగిరి' పుస్తకావిష్కరణ జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, గౌరవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ మాస్టర్ ఆకురాతి శంకరరావు, ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, సంధుబట్ల భూపతి, అల్లక తాతారావు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో మరింత ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సాధారణ కుటుంబాల నుంచి వచ్చినా కష్టపడి ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో నగదు పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను బహూకరించారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీనివాసులు మాట్లాడుతూ కష్టపడి చదువుకుని తల్లిదండ్రులు గర్వపడే విధంగా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఓబీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనింకి మురళీకృష్ణ, ఆలా లక్ష్మీ ప్రసన్న, నెహ్రూ యువకేంద్ర జిల్లా సమన్వయకర్త కిరణ్మయి దేవిరెడ్డి, శరత్‌బాబు, ఉపాధ్యాయులు నరసింహారావు, ఎస్వీ సత్యనారాయణ, అనంగి శ్రీనివాస్, రాణి రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.91 లక్షలతో వివిధ పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గురువారం 57వ డివిజన్ బసవతారక రామనగర్‌లో రూ.39.80 లక్షలు, 54వ డివిజన్ రాజేశ్వరరావు కాలనీలో రూ.31.70 లక్షలు, 50వ డివిజన్ మల్లికార్జునపేట 2వ లైన్‌లో రూ19.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణానికి తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు పఠాన్ నూర్జహాన్, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారని ఆరోపణ

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ 4వ లైను (తారుగుంట)లో పెద్ద గుంత ఉండేదని... కొద్ది సంవత్సరాల క్రితం దానిని వ్యర్థాలతో పూడ్చివేశారని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం అక్కడ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోందని.. భవిష్యత్తులో పడిపోయే ప్రమాదం ఉందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. ముందు టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు పరిశీలిస్తారని.. తాము ముందుగా వెళ్లి ఏ విధంగా చూస్తామని స్థానిక మహిళపై వారు చిర్రుబుర్రులాడారు.

పేదలకు సాయం అందజేత



ఉపకార వేతనాలు, కుట్టు యంత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గుంటూరు మెడికల్: పట్నంబజారులోని సుష్మా గౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, వికలాంగులకు మూడు చక్రాలు సైకిళ్లు, పేద విద్యార్థులకు రూ.1.60 లక్షల మేరకు ఉపకారవేతనాలను అందించారు. సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ మేరకు గురువారం పంపిణీ చేశారు. పారిశ్రామిక వేత్త పామర్తి సాంబశివరావు, గుంటూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి రంగారావు, గౌడ సేవా ట్రస్ట్ ఉపాధ్యక్షుడు చెన్ను శ్రీనివాస్ కుమార్‌ల చేతులు మీదుగా వీటిని అందించారు. సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా తమ సంస్థ ఆధ్వర్యంలో సాయం అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ కార్యదర్శి జల్లెడ ఓంకారం, ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివ ప్రసాద్ గౌడ్, కోశాధికారి జల్లెడ జయసుస్మిత రావు గౌడ్, ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మారావు గౌడ్, సహ కార్యదర్శి హరిత గౌడ్, ఆరెపల్లి విఘ్నేశ్వరమ్మ, బోయపాటి శ్రీకాంత్ చౌదరి, దొంతగాని సాయి గౌడ్, ఉయ్యూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో తలసీమియా నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: తలసీమియా వ్యాధి పట్ల అవగాహన పొంది ముందుగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వలన నివారించవచ్చునని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ అన్నారు. గురువారం ప్రపంచ తలసీమియా డే సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తలసీమియా బాధితులకు రూ. 12 వేలు పెన్షన్‌గా అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులను జీజీహెచ్‌కు తీసుకొస్తే సరైన చికిత్స అందిస్తారన్నారు. వ్యాధిపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. స్టేట్ బ్లాక్ సెల్ కన్సల్టెంట్ డాక్టర్ సోనియా మాట్లాడుతూ జన్యులోపం వల్ల వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వి.రంగారావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ఎలిజిబెత్, డాక్టర్ సుదీర్, డాక్టర్ ప్రియదర్శిని, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శాంసన్, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్స్ అందుకుంటున్న తన్మయి నాగదుర్గ

మంగళగిరి టౌన్: ఢిల్లీలో ఏప్రిల్ 30 నుంచి మే 5వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో తన్మయి నాగదుర్గ ప్రతిభ చాటిందని నిర్మల స్కూల్ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అండర్ 11 బాలికల విభాగంలో రాష్ట్రం తరుపున నవులూరుకు చెందిన తన్మయి నాగదుర్గ 1500 మీటర్ల రోడ్డు రేస్‌లో సిల్వర్ మెడల్, 500 మీటర్ల రింక్ రేస్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. తన్మయి మంగళగిరి నిర్మల సీబీఎస్ఈ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోందని తెలిపారు. జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి విజేతగా నిలిచిన బాలికను స్కూల్ యాజమాన్యం, స్కేటింగ్ కోచ్ ఎస్‌కే ఖాజా, ఫిట్‌నెస్ కోచ్ సుధాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రజా కాపునాడు సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లి రూరల్: ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ కమిటీని గురువారం తాడేపల్లిలోని సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటుచేశామన్నారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా పులేపు భాస్కరరావు, యూత్ అధ్యక్షుడిగా నక్క నవీన్‌రాజు, యూత్ సెక్రటరీగా పూడి రమణ.. ట్రెజరర్‌గా తాడికొండ నాగేశ్వరరావు.. యూత్ ప్రచార కార్యదర్శిగా అడపా నరేష్.. యూత్ జాయింట్ సెక్రటరీగా అల్లు సాయి చక్రపాణి ఎన్నికయ్యారని తెలిపారు. జాయింట్ ప్రచార కార్యదర్శిగా కేసురెడ్డి మురళీకృష్ణ.. జాయింట్ సెక్రటరీగా గాజుల వీరకృష్ణ.. తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులుగా పలివేటి రమేష్ కుమార్.. కార్యదర్శిగా కొత్తూరు వెంకట మోహనరావు, యూత్ జాయింట్ సెక్రటరీగా వీరిశెట్టి వెంకటేశ్వరరావు ఎన్నుకున్నామని తెలిపారు.